క్లుప్తంగా

సర్పంచ్‌లకు రేపటి నుంచి శిక్షణ

జి.సిగడాం: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10, 11వ తేదీల్లో సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు బుధవారం తెలిపారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు విధిగా హాజరుకావాలని కోరారు.

రాష్ట్ర బాస్కెట్‌బాల్ పోటీలకు నాగమణి



నాగమణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు హయాతీనగరంలోని మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని మునకాల నాగమణి (9వ తరగతి) ఎంపికైంది. బుధవారం శ్రీకాకుళం ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌కు పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పి.సంధ్య తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ, సిబ్బంది అభినందించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



పాస్టర్స్ కార్యవర్గ ప్రతినిధులు

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల నియోజకవర్గ పాస్టర్స్ మినిస్ట్రీ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం అల్లినగరంలోని పీటర్ ఇవాంజిలికల్ చర్చి ఆవరణలో జరిగింది. దైవజనులు టి.పేతురు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడిగా ఆర్.శామ్యూల్, అధ్యక్షుడిగా అల్లు ఇమ్మాన్యుయేల్, ఉపాధ్యక్షుడిగా బి.ప్రకాశ్‌రావు, కార్యదర్శిగా టి.సూరిబాబు, సహ కార్యదర్శిగా జయరాజు, కోశాధికారిగా ఎస్.అభిషేక్, సహ కోశాధికారిగా కె.ప్రణీత్ జోయ్, సభ్యులుగా బి.సెఫన్యాస్వామి, ఎం.అగస్టన్‌రాజు, ముఖ్య సలహాదారులుగా ఎం.సత్యంలను ఎన్నుకున్నారు.

రాజేశ్వరికి వీణా అవార్డు



అవార్డుతో నటి రాజేశ్వరి

శ్రీకాకుళం కల్చరల్ : నగరానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారిణి కేశిరెడ్డి రాజేశ్వరికి వీణా అవార్డుతో సత్కరించారు. తెనాలి, కళల కాణాచి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి నాటకోత్సవంలో సాంఘిక, పౌరాణిక నాటక ప్రదర్శనలు జరిగాయి. ఇందులో విశాఖ వారి ఆధ్వర్యంలో ప్రదర్శించిన 'సిరికేళి' నాటకంలో అనసూయ పాత్రకు బెస్ట్ క్యారెక్టర్ నటిగా వీణ అవార్డు వచ్చిందని రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు రాజేశ్వరిని బుధవారం అభినందించారు.

పథకాలపై మత్స్యకారులకు అవగాహన

గార: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారులకు అందిస్తున్న పథకాలపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డు ఏజీఎం కె.రమేష్‌కృష్ణ అన్నారు. బుధవారం బందరువానిపేటలో జలసంపద ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తిదారుల సంఘంలో చేరి రుణాలు, శిక్షణలు పొందాలన్నారు. రాయితీలపై ఐస్‌బాక్సులు, వలలు, బోట్లు పొందే విధానాన్ని వివరించారు. హెచ్‌డీఎస్‌సీ సంస్థ డైరెక్టర్ పి.వి.రమణ మాట్లాడుతూ రైతులందరూ ప్రభుత్వ పథకాలు, ఫుడ్ ప్రోసెసింగ్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కె.సునీల్, రామసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం

శ్రీకాకుళం : పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళా కుటుంబాల సుస్థిరతే ధ్యేయంగా మెప్మా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. బుధవారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో మెప్మా, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగాన్ని నిర్మూలించేందుకు ప్రతి మూడు నెలలకోసారి మెప్మా ఆధ్వర్యంలో జాబ్ మేళాలు నిర్వహిస్తామన్నారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెప్మా రాష్ట్ర జీవనోపాధుల మేనేజర్ ఎస్.ఎన్.ఆర్ శ్రీనివాసరావు, నిపుణ డైరెక్టర్ నర్మదా రాణి, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, పట్టణ జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు బి.నాగలక్ష్మి, వి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాలనీలు..కన్నీళ్లు!

- ఇంకా ముంపులోనే రోడ్లు, ఖాళీ స్థలాలు
- స్వైర విహారం చేస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో స్థానికులు



భవానీనగర్‌లో మురుగునీటిలోంచే ప్రయాణం



డీసీసీబీ కాలనీలో ఓ లైన్‌లో నిలిచిన వర్షం నీరు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరం నడిబొడ్డున ఉన్న పలు కాలనీలు ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి. కొద్దిపాటి వర్షమొచ్చినా రోజుల తరబడి నీరు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. నీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండిపోవడంతో దుర్గంధం వెలువడుతోంది. డీసీసీబీ కాలనీ, భవానీనగర్ కాలనీ, వంశధారనగర్ కాలనీ-2, గోవిందనగర్ కాలనీ-2, బ్యాంకర్స్ కాలనీ, ఏఎస్ఎన్ కాలనీ, తోలపాలెం రోడ్డు, నీలమ్మతల్లి చెరువుగట్టు రోడ్డు, శాంతినగర్‌కాలనీ, ఇందిరానగర్‌కాలనీ, జామితోట, విశాఖ-ఏ, విశాఖ-బీ కాలనీలు, ఫ్రెండ్స్‌కాలనీ, తిలక్‌నగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రోడ్లు, ఖాళీ స్థలాల్లో వర్షపునీరు, మురుగునీరు చేరి దోమలు, పందులు, విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఏకంగా చెరువుని తలపించేలా ఖాళీ స్థలాలు దర్శనమిస్తున్నాయి.

ఖాళీ స్థలాలతో ఇక్కట్లు..

నగరంలో ఖాళీ స్థలాలతో పరిసర ప్రాంతాల వారికి ఇబ్బందులు తప్పడం లేదు. స్థలాల్లో మట్టి వేసి ఎత్తుచేయించడం, పిచ్చిమొక్కల్ని ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు చేపట్టకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోయి చెరువుల్లా మారుతున్నాయి. దోమలకు నిలయాలుగా మారి రాత్రివేళల్లో పరిసర ప్రాంతాలపై దాడి చేస్తున్నాయి. అధిక ధరలు వస్తే అమ్ముకుందామని భావిస్తున్న ఖాళీ స్థలాల యజమానులకు డబ్బులు.. మాకు జబ్బులు అంటూ స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ఓ ఇంటిముందు నిలిచిన వర్షంనీరు



కాలనీలో రాకపోకలకు పాట్లు

నెలల తరబడి నిల్వ..



మా ఇంటి ముందు నెలల తరబడి వర్షపు నీరు నిల్వ ఉంది. నాముపట్టి దోమలకు నిలయంగా మారింది. తీవ్ర దుర్వాసన వస్తుండటంతో ఇంటిలో ఉండలేకపోతున్నాం. బయటకు రాలేకపోతున్నాం. అధికారులు పట్టించుకోకపోవడంతో సొంత డబ్బులతో క్రషర్‌పొడి వేసుకున్నాం.

– డి.వి రమణ, భవానీనగర్, డీసీసీబీ కాలనీ శ్రీకాకుళం

ఉండలేకపోతున్నాం..



కొద్దిపాటి వర్షం కురిసినా మా ప్రాంతమంతా చెరువులా మారుతోంది. పన్నులు భారీగా కట్టించుకుంటున్నా అందుకు తగిన సదుపాయాలు మాత్రం కల్పించడం లేదు. కనీసం కాలువలు, రోడ్లు నిర్మించకపోతే ఎలా?కార్పొరేషన్‌లో ఉన్నామా.. ఏ మారుమూల గ్రామంలో ఉన్నామో తెలియడం లేదు.

– బి.విద్యావతి, భవానీనగర్, డీసీసీబీకాలనీ

సెల్‌టవర్.. మాకొద్దు బాబోయ్!



శాంతినగర్‌కాలనీలో సెల్‌టవర్ వద్దని నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

- పనులు అడ్డుకున్న శాంతినగర్ కాలనీవాసులు
- ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు ఫిర్యాదు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం అర్బన్: కాలుష్య నియంత్రణ మండలి బోర్డు నిబంధనల ప్రకారం జనావాసాలకు దూరంగా సెల్‌టవర్లు నిర్మాణం చేయాలన్న నిబంధనలను కొన్ని కంపెనీలు పెడచెవిన పెడుతున్నాయి. స్థానికుల నిరసనలను కాదని జనావాసాల మధ్య టవర్లు పెట్టేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయి. దీనిలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్‌కాలనీలో నెహ్రూ నగర్ వద్ద సెల్ టవర్ నిర్మాణానికి కంపెనీ ప్రతినిధులు పూనుకోవడంతో స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. టవర్ ఏర్పాటైతే రేడియేషన్ ప్రభావంతో అనారోగ్యానికి లోనవుతామంటూ పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రశాంతంగా జీవిస్తున్న తరుణంలో తమ ఆరోగ్యానికి భంగం కలిగించేలా సెల్‌టవర్ నిర్మాణం నిలుపుదల చేయాలని విన్నవించారు. దీంతో ఎమ్మెల్యే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడారు. ఆయన వెంటనే పనులు నిలుపుదల చేయాలని సచివాలయ సిబ్బంది ద్వారా నిర్వాహకులను ఆదేశించారు. ఈ సందర్భంగా సెల్ టవర్లు వద్దు.. ప్రజారోగ్యమే ముద్దు అంటూ స్థానికులు నినాదాలు చేశారు. భవిష్యత్‌లో సైతం ఈ ప్రాంతంలో సెల్‌టవర్ ఏర్పాటుచేయాలని ప్రయత్నం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

ఉద్యమం తప్పదు..



మా ప్రాంతంలో సెల్‌టవర్ నిర్మాణం ఆపకుంటే ఉద్యమించక తప్పదు. తక్షణమే టవర్ నిర్మాణానికి అనుమతులు రద్దు చేయాలి. నిర్మాణ సామగ్రిని వెనక్కి తీసుకెళ్లాలి. లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

– దుంపల రామారావు, శాంతినగర్‌కాలనీ, శ్రీకాకుళం

ఆరోగ్యంతో చెలగాటమా..



ఇప్పటికే అనేక ఇబ్బందులు పడుతుంటే ఇప్పుడు సెల్‌టవర్ ఏర్పాటుచేసి మా ఆరోగ్యాలు పాడుచేయవద్దు. ఇటువంటి టవర్లు ఏర్పాటు చేసి మా జీవితాలతో ఆడుకోవద్దు. అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– కె.రాజులమ్మ, నెహ్రూనగర్, శ్రీకాకుళం

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా డిజిటల్ బుక్



వల్లభరావుపేటలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి శ్రేణులకు కూటమి పార్టీ నుంచి ఎటువంటి ఇబ్బంది కలిగిన వెంటనే క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ బుక్‌కు సమాచారం అందిస్తే పార్టీ తరఫున తగు న్యాయం జరిగేలా చూస్తామని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ భరోసా ఇచ్చారు. మెంటాడ, నారువ, చిల్లపేట రాజాం, వల్లభరావుపేట పంచాయతీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో బుధవారం డిజిటల్ బుక్, క్యూఆర్ కోడ్‌పై అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నుంచి అన్యాయానికి గురైన, ఎటువంటి ఇబ్బందులు పడిన క్యూ ఆర్ కోడ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చినప్పటి రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలను, నాయకులను లక్ష్యంగా చేసుకుని వేధించడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం సమష్టిగా పని చేద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు గురాన మానస, నాయకులు మజ్జి రమేష్, దన్నాన హరి, ఆర్.ఎస్.రెడ్డి, టేకి బ్రహ్మజీ, దన్నాన సీతారాం, లంకలపల్లి శంకర్, పాల ముసలయ్య, పాల రాము, ఆళ్ల అసిరయ్య, నిద్రబంగి సత్యం, కాటుకుని రాము, కంబపు నర్సింహులు, బండారు కృష్ణ, మహంతి సత్యనారాయణ, ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న అకాడమీ సీఈవో రవికుమార్

ఎచ్చెర్ల : చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనలియర్ విద్యార్థులు, అధ్యాపకులకు రీసెర్చ్ అండ్ అండ్ డెవలప్‌మెంట్ ఫండింగ్ ఏజెన్సీస్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పరిశోధన పత్రాలు రాసే విధానం, ప్రచురితం తదితర అంశాలపై ఇన్నోవేషన్ ఇన్ఫినిటీ అకాడమీ సీఈవో డాక్టర్ వి.వి.రవికుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.టి.చంద్రశేఖర్, టీపీఓ డాక్టర్ బి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలస గ్రామస్తుల నిరసన



నిరసన తెలుపుతున్న చిట్టివలస గ్రామస్తులు

రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలోని శ్రేయాస్ పరిశ్రమలో ఉద్యోగాలు కల్పించాలని పైడి భీమవరం పంచాయతీ చిట్టివలస గ్రామానికి చెందిన పలువురు యువకులు, గ్రామస్తులు బుధవారం పరిశ్రమ వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు, ఉద్యోగులను పనిలోనికి వెళ్లనీయకుండా మాజీ ఎంపీటీసీ గుడివాడ నందీశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 30మంది గ్రామస్తులు అడ్డుకున్నారు. జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పరిశ్రమ యాజమాన్యం, చిట్టివలస యువకులతో మాట్లాడి సమస్య సద్దుమణించారు.

ఘనంగా వాయుసేన వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న వాయుసేన మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ వాయుసేన 93వ వార్షికోత్సవాన్ని నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ తర్వాత భారీ సంఖ్యలో మాజీ వాయు సైనికులంతా ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం మాజీ వాయుసైనికుడు కొయ్యాన నవీన్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎక్స్‌సర్వీస్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్, విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, హానరరీ చైర్మన్ ఎస్ఎస్.ఎల్.మూర్తి, సిక్కోలు ఎయిర్ వెటరన్ కన్వీనర్ బి.ఈశ్వరప్రసాద్, కొండవీటి రమేష్, ప్రేమ చందు పట్నాయిక్, పి.అన్నాజీరావు, ఎం.మురళి, ఎం.వేణుగోపాల్, జి.వేణుగోపాల్, ఐ.వి.ఆర్.మూర్తి, ఎస్.కిషోర్, ఎ.వి.రమణ, ఎ.వి.జగన్‌మోహనరావు, ఎస్.సీతారాం, ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్య లోపం

- బోర్లు, బావుల వద్ద నిలిచిపోతున్న వాడుక నీరు
- ఫలితమివ్వని 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర'
- పట్టించుకోని అధికారులు



ముషినివలసలో బావి వద్ద దుస్థితి



జగన్నాథవలసలో చెరువులా మారిన సిమెంట్ రోడ్డు

జి.సిగడాం: పారిశుద్ధ్య నిర్వహణ కోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంటోంది. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నా పల్లెల్లో పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం మార్పు రావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఫొటోలకు పోజులిచ్చి వెళ్లిపోతున్నారు తప్ప పనులు చేపట్టడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. జి.సిగడాంమండలం ముషినివలస గ్రామంలో సుమారుగా వెయ్యి మంది జనాభా ఉన్నారు. ఇక్కడి తాగునీటి బావి చుట్టూ వాడుక నీరు నిలిచిపోవడంతో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ఫలితంగా దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. జగన్నాథవలసలో ప్రధాన రోడ్డులో మురుగునీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదే పరిస్థితి అనేక గ్రామాల్లో నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

దోమల మోత



బావి వద్ద వాడుక నీరు నిల్వ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు, ఈగలు మోతతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– డి.అంకమ్మ, ముషినివలస, జి.సిగడాం మండలం

చర్యలు తీసుకుంటాం



ముషినివలసలో ఉన్న బావి వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. బావినీరు ఎవరూ వాడకపోతే సంబంధిత అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– గుంటముక్కల రామకృష్ణారావు, ఎంపీడీఓ, జి.సిగడాం

కొనసాగుతున్న బస్సుల రద్దీ



నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



ఇచ్ఛాపురం, పాతపట్నం వైపు వెళ్లేందుకు వేచి ఉన్న ప్రయాణికులు

దసరా పండగ అనంతరం తిరుగు ప్రయాణ రద్దీ కొనసాగుతునే ఉంది. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ బుధవారం కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపించింది. దూరప్రాంతాలకు వెళ్లే వారితో విశాఖ నాన్‌స్టాప్ కౌంటర్ రద్దీగా మారింది. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం, బత్తిలి, కొత్తూరు, రాజాం తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు సకాలంలో బస్సులు లేక ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు.

– శ్రీకాకుళం అర్బన్

అయ్యప్పకు క్షీరాభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగలోని అయ్యప్ప దేవాలయంలో బుధవారం స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాల అనంతరం ప్రత్యేకంగా అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డి చిరంజీవులు, రాజారావు పాల్గొన్నారు.

12న సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలో వరసిద్ధివినాయక పంచాయతన దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 12న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు జీబీఏ స్వరమాధురీ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అదే విధంగా, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో తొలిసారిగా శ్రీకాకుళంలో 12 గంటల నిర్విరామ ఘంటసాల ఆరాధనోత్సవం డిసెంబర్ 21న నిర్వహించనున్నట్లు వెల్లడించారు.